# టిటోనీ

'నాన్నా మరేమో' - నసుగుతున్నాడు వాసు.

కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుతున్న వాడినల్లా ఒక క్షణం ఆపి - విసుగ్గా చూశాను వాడిని.

ఏదో అడగటానికి నా వేపు భయపడుతున్నట్టుగా వుంది -సూటిగా నా వేపు చూడలేకపోతున్నాడు. అప్పుడే చూశాను - మెయిన్ గేటు ప్రక్కనే తారట్లాడుతున్న వాసు స్నేహితుడు శంకరంనీ ... ఇంకొక కుర్రవాడినీ -

ఆ కుర్రవాడి మీద ఒక క్షణం నా చూపులు నిలిచినయి. సన్నగా పొడుగ్గా ఎర్రగా ఉన్నాడు. తెల్లటి ఖద్దరు పాంటు - కొంచెం మాసినది - పసుపచ్చ రంగు టెరీకాటన్ షర్టు మీద టక్ చేశాడు. వయస్సు పదిహేను సంవత్సరాలు వుండవచ్చు. కళ్ళు అమాయకంగా వున్నయి. నన్ను చూసి కొంచెం పక్కకు తప్పుకున్నాడు.

'అతనే నాన్నా రాజన్' అన్నాడు వాసు నెమ్మదిగా.

పుత్రరత్నం పెద్ద కథేదో చెప్పబోతున్నాడులా వుంది. అందుకే కాంపోజిషన్ పుస్తకాల్ని ప్రక్కకు నెట్టి - 'ఏమిటిరా నీ గొడవ చెప్పు' అన్నాడు.

ఆ మాటతో ఉత్సాహం పుంజుకునని 'అది కాదు నాన్నా ... అతను మద్రాస్ అతను - మద్రాస్ నుంచి తరపతి పోతున్నాడుట - ట్రెయిన్‌లో నిద్ర వచ్చేసిందట - లేచేసరికి బెజవాడలో వున్నాట్ట. టి.సి. చూసి ట్రెయిన్ దించేశాట్ట... యితనేమొ...'

నా ముఖంలో భావాలు మారటం చూసి అగాడు వాసు.

'మద్రాస్ నుంచి తిరుపతి పోవాలంటే బెజవాడ మీదుగా వెళ్ళాలిటరా పిచ్చితండ్రీ - వాడెవడో భలే టొకరా యిచ్చాడు నీకు. వాణ్ణి వచ్చిన దారినే వెళ్ళమను ... పిచ్చి పిచ్చి వేషాలు వేయక!' కాంపోజిషన్ పుస్తకాలు ముందుకు లాక్కున్నాను.

నావేపు అదోలా చూశాడు వాసు. ఏదో యింకా చెబుదామనుకున్నాడు - అయినా లాభం లేదనుకున్నాడో ఏమో - సరాసరి వంటింట్లోకి దారితీసి వాళ్లమ్మతో చెబుతున్నాడు.

ఒక్కడే కొడుకేమొ - పార్వతికి వాడంటే ప్రాణం.

లోపల్నించి మాటలు వినబడుతున్నాయి - 'మీ నాన్న మాటలకేంలే నాయనా - ఆయనెప్పుడూ అంతే - ఆయనలో ఏ కోశానయినా దయాదాక్షిణ్యం వుంటేనా... ఆ కుర్రవాడ్ని లోపలకు పిలు - ఎప్పుడు భోంచేశాడో ఏమో -'

మా ఆవిడ మాటలకన్నా ముందుగా బయటకు దూసుకువచ్చాడు వాసు - నా వేపోసారి నిర్లక్ష్యంగా చూసి - మరుక్షణంలో శంకరంతోనూ - సదరు మద్రాస్ తంబితోనూ నా ముందు ప్రత్యక్షమయాడు.

ఇంతలో పార్వతి కూడా రంగం మీదకు వచ్చింది.

'మీ నాన్న పేరేమిటి బాబూ!' అడిగింది పార్వతి.

రాజన్ కన్నీళ్లు తుడుచుకున్నాడు. ఏమీ జవాబు చెప్పలేదు.

'రాజన్‌కి తెలుగు రాదమ్మా ....' అని వాళ్లమ్మతో అని 'రాజన్ యువర్ ఫాదర్ నేమ్ ఈస్ వాట్' అన్నాడు ఇంగ్లీషు మాష్టరునయిన నా పుత్రరత్నం, తన రెండోఫారం తెలివి తేటల్ని పురస్కరించుకొని.

రాజన్ అర్థం చేసుకున్నట్టుగా తల ఊపి 'నరసింహన్' అన్నాడు.

'ఎంత బాధపడుతున్నాడో యేమోనే అమ్మా, మనం అవన్నీ అడిగితే!' అంటున్నాడు వాసు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. తెలుగులోనే గబగబా అనేశాడు - 'ఒరే రాజన్ - అసలు నువ్వు ఇంట్లోంచి ఎందుకు బయల్దేరావ్? బయల్దేరిన వాడివి రైల్లో ఎందుకు నిద్రపోయావ్? నిద్రపోయిన వాడివి బెజవాడలోనే ఎందుకు నిద్ర లేచావ్? అసలు మద్రాసు నుంచి తిరుపతి పోయే రైలు బెజవాడ మీదుగా ఎప్పట్నించి వెడుతున్నది ? అసలు నువ్వు చెప్పేది అంతా నిజమేనా - అబద్ధమా - ఇంతకీ మీ నాన్నెవరు ? ఏం చేస్తుంటాడు ? నిన్నొక్కడ్ని

ఎందుకు పంపించాడు - అసలు యింట్లో చెప్పే బయల్దేరావా ? దొంగతనంగా పరారయావా - చెప్పు!'

నా భీకరాకారం చూసి రాజన్ ఒక్కసారిగా ఏడ్చేశాడు. శంకరం రాజన్ భుజం మీద చేయి వేశాడు. వాసు 'డు నాట్ వీప్ రాజన్' అంటున్నాడు. అప్పుడే చూశాను - రాజన్ చేతిన వున్న 'టిటోనీ' ఆటోమేటిక్ వాచ్‌ని.

'ఎందుకండీ పిల్లవాడ్ని అదరగొడతారు, అసలే వాడు తప్పిపోయి ఏడుస్తుంటే - మీకేమన్నా 'యిది' ఉందా' - పార్వతి తన నోరును విప్పింది.

కాంపోజిషన్ పుస్తకాలు ముందుకు లాక్కున్నాను, పార్వతినోసారి క్రీగంట చూసి.

వాసు చెబుతున్నాడు - 'స్టేషన్ దగ్గర ఏడుస్తూ ఉంటే స్కూల్నించి వస్తూ నేనూ, శంకరం ఇతన్ని పలకరించామే అమ్మా - ఇతను అన్నీ చెప్పాడు. వాళ్ల నాన్న రాజన్ తిరుపతికి వెడతానంటే యిరవై రూపాయలు యిచ్చి పంపించాడుట. రాజన్ ఏమో....' తరవాత ఏమయిందో తెలీని వాసు రాజన్ వేపు తిరిగి 'కదూ రాజన్' అన్నాడు.

రాజన్ ఒకసారి పార్వతి వేపు, వాసు, శంకరాల వేపు అదోరకంగా చూసి అరవంలోనే మొదలుపెట్టాడు. నాకు ప్రతి మాటా అర్థం కాకపోయినా - విషయం మాత్రం అర్థం అయింది.

తిరుపతి రైలు ఎక్కబోయి - కలకత్తా రైలు ఎక్కాడుట - బెజవాడలో దింపేశారుట - తన దగ్గర వున్న మిగిలిన డబ్బులు టి.సి ఉంచేసుకున్నాడుట - ఫైన్ అని చెప్పి. తాను అడుక్కు తినేవాడిని కాననీ - పెద్ద కుటుంబంలో నించే వచ్చాననీ, వాళ్ల నాన్న సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ అనీ - ఇంకా చాలా చెప్పాడు. ఒక పదిహేను రూపాయలు యిస్తే తాను మళ్లీ మద్రాసు వెళ్ళిపోతాననీ సహాయం చేయమనీ అడిగాడు.

అతన్ని నాలుగూ దులిపేద్దామనుకుంటున్నంతలో పార్వతి అన్నది - 'సరే రాజన్ నీకు రైలు ఛార్జీలు యిచ్చి పంపిస్తాంలే గాభరా పడకు - కానీ ఈ రాత్రికి యిక్కడ ఉండు. రేపు రాత్రికి వెడుదువు గానిలే - ఇప్పటికే అనవసరంగా ఎంత హైరానపడ్డావో !'

నేను తల ఎత్తే లోపల వాసు రాజన్‌ని తీసుకువెళ్ళాడు.

నాకెందుకో రాజన్ చెప్పిన కథ నమ్మబుద్ధవలేదు - రోజూ యింటి నుంచి స్కూలుకి వెళ్లేలోపల ఎంతో మంది ఏవేవో కథలు చెబుతుంటారు. అడుక్కుతినటంలో అదో అందమైన పద్ధతి మరి. స్వతంత్ర భారతదేశంలో, ఈ ప్రజాస్వామ్య పరిపాలనలో ముష్టివాళ్ళు ఎక్కువ. ముష్టెత్తటం సగటు భారతీయుల జన్మహక్కు. దీన్నెవరూ కాదనలేరు మరి - ఈ రాజన్‌కి పదిహేను రూపాయలూ అనవసరంగా ఇచ్చేబదులు - ఏ పూర్ బాయిస్ ఫండుకో డొనేట్ చేస్తే నా పేరుతో నాలుగు క్లాసు పుస్తకాలైనా కొనుక్కుంటారు.

నా ఆలోచనలకు బ్రేక్ వేస్తూ పార్వతి అంది - 'ఏమండీ పసికుర్రవాడు, పాపం -రేపు ఒక్కడ్నీ పంపిస్తే మద్రాస్‌లోనే దిగుతాడని నమ్మకం లేదు - పైగా ప్రతివాడూ దొంగవెధవలే ఈ కాలంలో .... వాళ్ల నాన్న అడ్రస్‌కి ఒక టెలిగ్రాం యివ్వండి. ఆయనే వచ్చి తీసుకుపోతాడు.'

'మధ్యలో యిదో తద్దినం ఎందుకు పార్వతీ ..... ఈ పూట కెటాగో పిల్చావు కనుక - కాస్త తిండిపెట్టి బయటికి పొమ్మను - వాడి సంగతి మనకెందుకు'

పార్వతి గుర్రుగా చూసింది నన్ను - 'అదే మన పిల్లవాడిలా తప్పిపోతే ..... మనమెంత గాభరాపడిపోతామండీ - మీలో ఏ మాత్రం ....'

కుర్చీ నించి సర్రున లేచాను - 'ఊ! సరే అడ్రసిమ్మను.... టెలిగ్రాం యిస్తాను!'

ఒకరోజు భోజనం పెడితే సరిపోతుంది. వాళ్ళ నాన్న వచ్చి వాడ్ని తీసుకుపోతాడు. పదిహేనూ యివ్వక్కలేదు - పరకా యివ్వక్కర్లేదు.

రాజన్ తల మీద స్నానం చేసినట్టున్నాడు. తల తుడుచుకుంటూ వచ్చి అడ్రస్ చెప్పాడు.

పోస్టాఫీస్‌కి వెళ్లి - 'మీవాడు మా దగ్గరున్నాడు - వెంటనే వచ్చి తీసుకెళ్లండి' - అని టెలిగ్రాం యిచ్చాడు.

'ఏం ఇవాళ బంగాళదుంప వేపుడు చేశావ్ - మీ పుట్టింటి వాళ్ళెవరైనా వచ్చారా?' అన్నాను ఔపోసనపడుతూ.

'ఆ! మరే - మీరు తెచ్చిపడేసే ఆస్తి అంతా మూలుగుతున్నదని - తినటానికి మా పుట్టింటి వాళ్ళని రమ్మంటే వచ్చారు!' మరికొంచెం వడ్డించింది మా ఆవిడ.

'అది కాదు నాన్నా! రాజన్‌కి బంగాళా దుంప వేపుడు యిష్టంట!' అన్నాడు వాసు.

పార్వతి రెండవసారి వేసిన కూరని కూడా స్వాహా చేసి నా వేపు అదోలా చూస్తున్నాడు.

వాడికి బయట వరండాలో ప్రక్క వేయమన్నా వినకుండా, పార్వతి మాతోపాటే ప్రక్క వేసింది.

నిజం చెప్పద్దూ. - నాకు మాత్రం నిద్ర పట్టలేదు. వాడా రాత్రి ఏ సామాను బయటకు చేరవేస్తాడో అన్న అనుమానంతో కళ్ళు తెరుచుకుని మరీ పడుకున్నాను.

నేనకున్నట్టుగానే, అంతా సర్దుమణిగిన తర్వాత, రాజన్ నెమ్మదిగా లేచాడు. అడుగులో అడుగు వేసుకుంటూ, కిటికీ దాకా వెళ్ళి బయటకు చూస్తూ నుంచున్నాడు. ఒకపావు గంట అయినా మనిషి కదల్లేదు ఏం చేస్తాడా అని అలాగే చూస్తున్నాను నేను.

'రాజన్ నిద్ర పట్టలేదా!' వాసు కూడా మేలుకునే వున్నట్టున్నాడు - అడిగాడు.

రాజన్ కొంచెం గాభరా పడ్డాడు. 'ఉహూ ! ఉహూ!' అంటూ తన ప్రక్క మీదకు వెళ్లి పడుకున్నాడు.

దొంగతనం చేయబోయే వాడిని రెడ్‌హాండెడ్‌గా పట్టుకునే అవకాశాన్ని పోగొట్టిన వాసుని మనస్సులోనే విసుక్కున్నాడు.

నిద్రపోకుండా అలాగే పడుకున్నాడు.

ఎప్పుడు కన్నంటిందో ఏమో - చటుక్కున ఏదో శబ్దమయి మెళకువ వచ్చింది.'ఏం రాజన్ - నిద్రపట్టలా!' అడుగుతున్నది పార్వతి.

'ఊహు' మంచినీళ్ళు తాగుతున్నాడు రాజన్.

'దాహమయిందా - నన్ను లేపకపోయావా !' అంటూనే అటు తిరిగి నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది పార్వతి.

ఆ చీకటిలో రాజన్ చేతి టిటోనీ వాచ్ రేడియం డయిల్ వల్ల తళతళా మెరుస్తున్నది. రాజన్ నిజంగానే అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకేమో - లేకపోతే అంత ఖరీదయిన గడియారం ఎలా పెట్టుకుంటాడు? పదేళ్ళ సర్వీసున్న నేనే గడియారం కొనుక్కోలేకపోయాను. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీలేదు.

మర్నాడు మద్రాస్ నించి ఎవరూ రాలేదు - చీకటి పడింది - తెల్లవారింది - కాని ఎవరూ రాలేదు.

రాజన్‌ని నిలదీసి అడిగాను 'ఏరా రాజన్ - ఏడి మీ నాన్న?'

రాజన్ ఏమీ మాట్లాడలేదు.

'దొంగవెధవా! మా ఆవిడ తెలివితేటల వల్ల కొత్త అల్లుడులాగా ఈ రెండు రోజులూ సేవలు చేయించుకొని- కడుపు నిండా తిన్నావు. యిక నడు - బయటికి,' పార్వతి అప్పుడే వస్తూ అన్నది - 'అసలు మీరు టెలిగ్రాం యిచ్చారా - డబ్బు ఖర్చని ఊరుకున్నారా? అది చెప్పండి' నిలదీసింది.

నిన్న వచ్చినవాడు ఎక్కువయాడు పార్వతికి. కోపంగా అన్నాను - 'వాడిచ్చిన అడ్రసు కరక్టయి చస్తే కదా టెలిగ్రాం అందటానికి - ఏ సినిమా డైరెక్టరీలో చూసి అడ్రసిచ్చాడో దొంగవెధవ!'

పార్వతి నా వేపు కోపంగా చూసింది.

వాసు 'నాన్నెప్పుడూ యింతే' అన్న ఫోజులో వున్నాడు.

రాజన్ తాపీగా తన చేతికున్న వాచీని తుడుచుకున్నాడు. వాడికి తెలుగు పూర్తిగా అర్థంకాక పోవటం వల్ల - మా బాధ వాడికి తెలిసినట్లు లేదు మరి.

'ఒరే రాజన్ - నువ్విక ఒక క్షణం యింట్లో వున్నావంటే బాగుండదు - గెటవుట్!' పెద్దగా అరచి - పార్వతిని హెచ్చరించి మరీ - స్కూలుకి వెళ్ళాను.

స్కూల్లో పని హడావిడి వల్ల యింటికి వచ్చేసరికి ఆలస్యమయింది - వస్తునే రాజన్ కోసం చూశాను, కనపడలేదు. పార్వతిని అడిగాను.

'ఎందుకు'? అన్నది నిర్లక్ష్యంగా.

'ఎందుకేమిటి నీ మొఖం - మూడ్రోజుల నా సంపాదన తిన్నాడు - ఆ మాత్రం అడిగే హక్కు లేదా నాకు!' అన్నాను.

'వెళ్ళాడు - మద్రాస్‌కి ఈ సాయంత్రమే!'

'మరీ డబ్బులు?'

మా ఆవిడ నా వేపు సూటిగా చూసింది.

'నేనే యిచ్చాను!' అన్నది దృఢంగా.

కోపాన్ని తమాయించుకున్నాను. 'అది కాదు పార్వతీ - డబ్బు గురించి కాదు నా బాధ - అటువంటి వాళ్ళంతా దొంగవెధవలు. మనం వాళ్ల కథలన్నీ నమ్మి డబ్బిస్తే - వాళ్లిక పనిచేయరు. ఈ రకంగానే డబ్బు సంపాదించటం అలవాటు చేసుకుంటారు. అటువంటి వాళ్లే ప్రస్తుతం మన దేశంలో ఎక్కువ. దేశ ప్రగతి ఆగిపోవడానికి సగం కారణం ఈ బద్ధకస్తులే.'

ఈ మాటలు వినటం యిష్టం లేక కాబోలు - కాలుతున్న పోపు గింజల్లో నీళ్ళు చల్లి 'బుస్సు' మనిపించింది పార్వతి.

సణుక్కొంటూ లోపలికి నచ్చాను. కాంపోజిన్ పుస్తకాలు ప్రక్కనే తళతళమెరుస్తూ - టిటోనీ ఆటోమేటిక్ వాచ్ - ఈ మూడు రోజులూ రాజన్ చేతిని అలంకరించిన గడియారం కనబడింది.

నెమ్మదిగా చేత్తో అందుకున్నాడు. తేరిపార చూశాను. తళతళా మెరుస్తున్నది. ఖరీదు మూడు వందల రూపాయలని తెలుసు. పాపం! రాజన్ గడియారం మరచిపోయినట్టున్నాడు.

చట్టుక్కున టైము చూశాను - ఎనిమిది గంటలయింది.

రాజన్ ఎక్కిన రైలు బెజవాడ దాటి చాలా దూరం వెళ్లి వుంటుంది.

ఆలోచించాను. రాజన్ గురించే ఆలోచించాను. నేనే అతన్ని తప్పుగా అర్థం చేసుకున్నానేమో - రాజన్ దొంగ కాదు - అతను చెప్పిన కథ నిజమే కావచ్చు - రాజన్ దొంగ అయితే చేతికి దొరికినవన్నీ మూటగట్టుకుపోయేవాడు. మనిషిలో కూడా సంస్కారం ఉంది. అతను దొంగ అనటానికెందుకో నాకు మనస్కరించటం లేదు. పాపం - యింత ఖరీదు గల గడియారం మరచిపోయాడు. మెరుపులా గుర్తుకువచ్చింది, రాజన్ అడ్రస్. రాజన్ అడ్రస్‌కి పోస్టులో పంపిస్తే! మూడు వందల రూపాయల ఖరీదైన గడియారం మళ్లీ దొరికితే ఎంతో సంతోషిస్తారు - పంపించాలి.

ఆలోచనలతో ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు.

తెల్లవారిన తర్వాత లేస్తూనే - పక్కనే ఉన్న పెన్సిల్‌తో గోడ మీద నూట యెనభై రూపాయలు అని వ్రాశాను. అది నా నెల జీతం.

★ ★ ★

స్టాఫ్ రూంలో కూర్చుని ఉన్న నన్ను సైన్సు మాస్టారు సుబ్రహ్మణ్యంగారు పలకరించారు. 'ఏమిటి శర్మగారూ, గడియారం కొత్తగా కొన్నారా' అంటూ.

ఒక్క క్షణం ఆయన వేపు చూశాను. కొంచెం గాభరాగా చిరునవ్వు నవ్వాను.

'అవునండీ, మా బావమరిది విశాఖపట్నం నుంచి వస్తుంటే తెమ్మన్నాను. ఎలాగయినా అక్కడ గడియారాలు చవుకేనండీ - మొత్తం మూడొందలయింది!' అన్నాను - నా 'టిటోనీ' ఆటోమేటిక్ గడియారాన్ని సర్దుకుంటూ.

'టిటోనీ చాలా మంచి గడియారమండీ. నా వాచ్ కూడా అదే - కాని మొన్న ఒక కుర్ర వెధవ ....' అంటూనే వెనక వున్న ఆ స్ట్రాప్‌ని పక్కకు తొలిగించారు సుబ్రమణ్యం గారు.

దానిమీద 'పి. సుబ్రమణ్యం' అని అందమైన అక్షరాలతో చెక్కి వుంది. ❋